క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎంటీ హిల్స్ పరిధిలోని సమతానగర్, అడ్డగుట్ట, విజేత సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. అదే విధంగా పీజేఆర్ నగర్ ఫీడర్ పరిధిలోని పీజేఆర్‌నగర్, అంబేద్కర్ నగర్, జన్మభూమి కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులను పూర్తి చేయాలి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధి వినాయక్‌నగర్ ప్రధాన రహదారిలో జరుగుతున్న వీడీసీసీ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పర్యవేక్షించారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మందడి సుధాకర్‌రెడ్డి, నాయకులు మురళీధర్, కాలనీ అధ్యక్షుడు సిద్ధి రాములు, అసోసియేషన్ సభ్యులు భీంరావు, శ్రీనివాసరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా అభివృద్ధి పనుల పరిశీలన

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీ పురంలో చేపట్టిన ఈద్గా అభివృద్ధి పనులను మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, ఏఈ పవన్, ఈద్గా కమిటీతో కలిసి పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా కోటి రూపాయల నిధులతో ఎమ్మెల్యే కృష్ణారావు ఈద్గా పనులను చేపట్టారని తెలిపారు. ఈ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఇమ్రాన్, ఎండీ సాబేర్, సలాం భాయ్, షౌకత్, అబ్దుల్ ఆయుబ్, అన్వర్, సంతోష్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం, నిర్వాహకులు సుమన్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో కార్పొరేటర్ సబిహా బేగం మంగళవారం ఖార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సుమన్‌తో కలిసి కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏ ప్రభాకర్, సీఏ ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాహెద్ షరీఫ్ బాబా, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, అనుబంధ కమిటీ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



సాయిచరణ్ కాలనీలో రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి శంషీగూడ సాయిచరణ్ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. నిర్మాణం పూర్తయినందున క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. వివిధ కాలనీల్లో గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, వెంకట్‌నాయక్, లక్ష్మమ్మ, సాయిగౌడ్, వెంకటయ్య, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

'ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతులే కరెంటు షాక్ ఇస్తారు'

కూకట్‌పల్లి: వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేయాలని కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు బొట్టు విష్ణు అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు అందకుండా చేస్తామంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతులే కరెంటు షాక్ ఇస్తారని అన్నారు. ఎంపీ రేవంత్‌రెడ్డి రైతాంగానికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున నిరసన తెలపాలని కోరారు.

చిత్తారమ్మ బోనాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- పోలీసు, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్ష



సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి చిత్తారమ్మ దేవాలయంలో ఈనెల 16న జరిగే బోనాల పండుగ ఏర్పాట్లపై పోలీస్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని వారికి ట్రాఫిక్‌తో ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో తాగునీరు, పోలీస్, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేటట్లు చూడాలన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించాలని సూచనలు చేశారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తక్షణం తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, సీఐ సురేంద్ర, ఈఈ గోవర్ధన్, అన్ని విభాగాల ముఖ్య అధికారులు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, చైర్మన్ తులసీరావు, ఈట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఖార్డు సంస్థతో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటా: ఎమ్మెల్యే

మూసాపేట: మూసాపేటలోని జీహెచ్‌ఎంసీ మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనంలో మంగళవారం ఖార్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిరుపేదలకు తమవంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఖార్డ్ సంస్థ ఎంతో కృషి చేస్తోందన్నారు. నిరుపేదలు ఆర్థికంగా ఉన్నతి సాధించాలనే ఉద్దేశంతో సంస్థ అధినేత సుమన్‌తో చర్చించి మహిళలకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు.

◆ దానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అంతేకాకుండా శిక్షణ పూర్తయిన వారికి తన సొంత నిధులను కలిపి ఖార్డ్ సంస్థతో కలిసి కుట్టు మెషిన్లను అందజేస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో రూ.44లక్షల తన సొంత నిధులతో అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్‌లో ఖార్డు సంస్థతో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవటానికి ముందుకు వెళ్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జిల్లా గోపాల్, పీఏ ప్రభాకర్, సీఏ మురళి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నూతన డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

సనత్‌నగర్: ఎలాంటి సమస్య అయినా పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ తదితర విభాగాలకు చెందిన అధికారులతో బేగంపేట డివిజన్ పరిధిలోని చీకోటి గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతం లోతట్టు ప్రాంతం కావడంతో వరదనీరు చేరి ముంపునకు గురవుతుండడంతో పాటు తరచూ డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

◆ దీనికి స్పందించిన ఆయన వరదనీటిని ఎప్పటికప్పుడు మోటార్ల ద్వారా తరలించే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వరద నీరు సాఫీగా వెళ్లేలా నూతన డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే బేగంపేట ప్రధాన నాలా అభివృద్ధికి రూ.45 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులను చేపట్టినట్లు చెప్పారు. దీని ద్వారా నాలా పరివాహక ప్రాంత ప్రజల ముంపు సమస్య తొలగనుందన్నారు. కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, నాయకులు సురేష్‌యాదవ్, రాజయ్య, నరేష్, సత్యనారాయణ, డీఎంసీ ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ డీజీఎం శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



వెంకటేశ్వరనగర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సీఐ క్రాంతికుమార్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ 35 బ్లాక్ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.9లక్షల ఎమ్మెల్యే నిధులతో, రూ.3 లక్షల కాలనీ నిధులు ఖర్చు చేశారు. మంగళవారం మొత్తం 60సీసీ కెమెరాలను సీఐ క్రాంతికుమార్‌తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. కాలనీలో నేరాల అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీవాసులు ముందుకు రావటం అభినందనీయమన్నారు. శాంతి భద్రతలు కాపాడటానికి పోలీస్ అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు వారు విస్తృతమైన ప్రచారం చేశారని తెలిపారు. అన్ని కాలనీవాసులు ఈ విధంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు చంద్రకాంత్‌రావు, హరినాథ్, ఆంజనేయులు, లక్ష్మీ నర్సయ్య, చంద్రమోహన్‌సాగర్, శ్రావణిరెడ్డి, శివసాగర్, సంపత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పిస్తాం



ఈవీఎం మెషిన్లపై అధికారులకు అవగాహన కల్పిస్తున్న జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: రానున్న ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఈవీఎం మెషిన్లపై జోనల్ కమిషనర్ వి. మమత అవగాహన కల్పించారు. ఎన్నికల తేది ప్రకటించే వరకు కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డుల్లో ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీసీలు, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కేపీహెచ్‌బీకాలనీ 3వ ఫేజులో బోనాలు 16న

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ 3వ ఫేజులోని పోచమ్మతల్లి దేవస్థానం బోనాల పండుగ 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 2గంటలకు మహా నైవేద్యం, 5.30 గంటలకు అభిషేకం, అర్చన జరుగుతాయి. ఉదయం 6 గంటల నుంచి బోనాల సమర్పణ, ఉదయం 10 గంటలకు అమ్మవారి శక్తి వేషాలు, ఘటాలు, ఆటలు జరుగుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన, 3 గంటల నుంచి ఉత్సవ విగ్రహ పూజ, ఊరేగింపు జరుగుతుంది. ఈ బోనాల కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ధర్మారెడ్డి కాలనీ ఫేజ్ 2 ఆలయంలో..

ఈ నెల 16వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 8గంటల వరకు రేణుకాఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి గడప నుంచి గ్రామ దేవతకు బోనాలు సమర్పించుకొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఎన్టీఆర్ పాఠశాలను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తా



పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌లో నిర్మిస్తున్న ఎన్టీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనులను మంగళవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పేరుమీద పాఠశాల నిర్మించి నిరుపేద విద్యార్థులకు విద్యను అందించనున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అతి త్వరలో ఈ పాఠశాల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అదే విధంగా ఈ పాఠశాలకు సహకరించిన ఎమ్మెలే మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గఫూర్, శ్రీరామ్, కేఎస్‌వీ రామారావు, మస్తాన్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదానం శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలో రాజప్ప సంవత్సరీకం సందర్భంగా ఆయన కుమారులు భరత్, సుమంత్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసీమియాతో బాధపడుతున్న పిల్లల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం మంచి నిర్ణయమని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. సుమారు 100 మంది రక్తదానం చేయడం శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఎం. విజయకుమార్ చౌదరి, కమిటీ మెంబర్లు జగదీష్, సురేష్, సోమేష్, విష్ణు, రాంబాబు, ఫణికుమార్, జయప్రకాష్, పవన్, భారత్, సుమంత్, సంకల్ప సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌కి చెందిన రాజేశ్వరి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన రూ.94వేల చెక్కును మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు శ్రీధర్‌రెడ్డి, కనుక రెడ్డి, భగవంతురెడ్డి, రామకృష్ణారెడ్డి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష నేతలతో రిటర్నింగ్ అధికారి సమీక్ష



వివిధ రాజకీయ పక్షాలతో సమావేశమైన ఎన్నికల అధికారి మంగతాయారు

కుత్బుల్లాపూర్: ఓటర్ లిస్టులో పేర్ల తప్పుల తడకలు, నూతన ఓటర్ల నమోదు తదితర విషయాలపై కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంగతాయారు మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. బూత్ లెవెల్ అధికారులు కేవలం ఓటర్ లిస్టును పట్టుకొని తిరుగుతున్నారు తప్ప వాస్తవాలను గ్రహించలేకపోతున్నారని పలు పార్టీల నాయకులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఒక్క ఇంట్లో ఆరు ఓట్ల కంటే ఎక్కువగా ఉన్న వాటిని పరిశీలించాల్సిన అవసరం ఉన్నా పట్టించుకోవడంలేదన్నారు. చాలా ప్రాంతాల్లో ఓట్లు గల్లంతు అవుతున్నాయని వాటిని పరిశీలించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లతో పాటు వివిధ పక్షాల నేతలు పాల్గొన్నారు.

'6 నెలల్లో వాహనాల కోసం సంప్రదించకపోతే వేలం వేస్తాం'

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న వాహనాల కోసం వాహనదారులు పోలీసులను ధ్రువపత్రాలతో సంప్రదించకపోతే వేలం వేస్తామని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సైబరాబాద్ పరిధిలో 539 వాహనాలను స్వాధీనం చేసుకొని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ వాహనాల వివరాలను సైబరాబాద్ వెబ్‌సైట్ www.cyberabadpolice.gov.inలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉన్న యజమానులు వాటిని తిరిగి పొందేందుకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌హెచ్‌ఓను కలిసి మీ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లను ఆరు నెలల కాలపరిమితి లోపు సంప్రదించాలి. వివరాలకు ఎంటీఓ ఎస్. విష్ణు(94905 17317) లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా తెలంగాణ ఇంజినీర్ల దినోత్సవం



ఇంజనీర్‌ను సన్మానిస్తున్న రమ్యాగ్రౌండ్ మిత్ర బృందం సభ్యులు

కూకట్‌పల్లి: తెలంగాణ ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ రమ్యాగ్రౌండ్ మిత్ర బృందం మంగళవారం ఇంజినీర్లను సత్కరించారు. జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్‌ను వార్డు కార్యాలయంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొర్ల రామకృష్ణ, ముప్పాళ్ల సాంబశివరావు, గాలిరెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండిమైసమ్మ వయా గచ్చిబౌలి టు అప్పాకు బస్సు సౌకర్యం

రాయదుర్గం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గండిమైసమ్మ ఎక్స్‌రోడ్ నుంచి వయా గచ్చిబౌలి మీదుగా అప్పా వరకు నూతన బస్సు సౌకర్యాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో నుంచి ఈ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ప్రతి నిత్యం నాలుగు సిటీ ఆర్డినరీ బస్సులను నడపాలని నిర్ణయించారు. 221 జీఎం బస్సు నంబర్ పేరిట ఉదయం బస్సు 6:40గంటలకు ప్రారంభమై రాత్రి 9:15 గంటల వరకు మొత్తం 40 ట్రిప్పులను నడుపుతున్నామని డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. గండి మైసమ్మ ఎక్స్‌రోడ్‌లో ప్రారంభమయ్యే ఈ బస్సు మియాపూర్ మీదుగా గచ్చిబౌలి వరకు అక్కడి నుంచి నార్సింగి మీదుగా అప్పా వరకు కొనసాగుతుంది. అప్పాలో బయలుదేరే బస్సు నార్సింగి, గచ్చిబౌలి, మియాపూర్ మల్లంపేట్, బౌరంపేట్ మీదుగా గండిమైసమ్మ ఆలయం ఎక్స్‌రోడ్ వరకు నడుస్తుందన్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మెట్రో ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కూకట్‌పల్లి మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడు ఏకాంత్‌గౌడ్ సైతం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, నాయకులు గోవింద్‌గౌడ్, బాబూరావు, నగేష్, భానుయాదవ్, అశోక్, గణేష్‌గౌడ్ పాల్గొన్నారు.





అమ్మవారిని దర్శించుకున్న నేతలు గొట్టిముక్కల వెంగళరావు, ఏకాంత్‌గౌడ్

'ఎస్సీ వర్గీకరణ జరిగే రోజు దగ్గర్లోనే ఉంది'



చలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

కుత్బుల్లాపూర్: మాదిగ, మాదిగ ఉపకులాలు చలో వరంగల్ సభకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జనరల్ సెక్రటరీ సిలువేరు శ్రీనివాస్‌మాదిగ కోరారు. మంగళవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలో సభకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగతో ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చర్చించారన్నారు. ఢిల్లీకి రావాల్సిందిగా ఆహ్వానించారన్నారు. ఈ నేపథ్యంలో వరంగల్‌లో జాతీయస్థాయి, అనుబంధ సంఘాల నాయకులు సమావేశం కానున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ మాదిగ, నర్సింహులు, సలోని మాదిగ, పరశురామ్ మాదిగ, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల బాలానగర్ బాయ్స్-1లో తెలుగు ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా కాంపిటెన్సీ బేస్డ్ ఎడ్యుకేషన్‌లో 5 రోజులు పాటు శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డా. కల్పన తెలిపారు. మొదటి రోజు మంగళవారం వరంగల్, కరీంనగర్‌కు చెందిన 35 మంది తెలుగు ఉపాధ్యాయులు హాజరయ్యారని తెలిపారు. మొత్తం రాష్ట్రంలోని 204 మైనార్టీ గురుకుల పాఠశాలల ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. ఉపాధ్యాయులకు 6, 7వ తరగతి పాఠ్యాంశాలలో విద్యాపతి శిక్షణ ఇచ్చారు.

పాఠ్య పుస్తకాలు ఇవ్వకుంటే ధర్నాకు దిగుతాం



మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ నాయకుడు దొర అరుణ్

సుభాష్‌నగర్: ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘోరంగా విఫలమయ్యారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకుడు దొర అరుణ్ అన్నారు. మంగళవారం బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, ఒకేషనల్ కళాశాలను కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలేజీ ఎఫిలియేషన్ పూర్తయి ఏడాది కావస్తున్నా ఉపాధ్యాయుల నియామకం జరగలేదన్నారు. కనీసం విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు లేవని పేర్కొన్నారు. పుస్తకాలు సైతం అందలేదన్నారు. అరకొర వసతులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పాఠ్య పుస్తకాలు అందించకుంటే భారీ ఎత్తు ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

జల వనరుల పరిశుభ్రతకు ఈపీటీఆర్ఐతో ఒప్పందం

గచ్చిబౌలి: సిద్దిపేట మున్సిపాలిటీలో జల వనరుల పరిశుభ్రతకు ఈపీటీఆర్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. మంగళవారం ఈపీటీఆర్ఐ ఇన్నోవేషన్ ఇంక్యుబేటర్ హబ్ హెడ్ డాక్టర్ జె.స్వరాజ్, సిద్దిపేట పట్టణం 39 వార్డు కౌన్సిలర్ బోనగిరి దీప్తి నాగరాజు అవగాహన ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. డాక్టర్ స్వరాజ్ మాట్లాడుతూ.. అత్యంత ఆక్రమణ జాతులకు చెందిన గుర్రపు డెక్క నీటి వనరులకు ఇబ్బంది కల్గిస్తుందన్నారు. గుర్రపు డెక్కను తొలగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. మధుచంద్రిక చటోపాధ్యాయ, రైసుద్దీన్, శేఖర్ బాబు, నాగరాజు పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్

కుత్బుల్లాపూర్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వకుండా పేదలను తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ గణేష్‌నగర్‌లో మంగళవారం ఆయన ఇంటింటికీ కాంగ్రెస్ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కుత్బుల్లాపూర్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రెసిడెంట్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జ్ రాధాకృష్ణ, జిల్లా కిసాన్ అధ్యక్షుడు సదానందం, నాయకులు రహీం పాల్గొన్నారు.

భర్త తాగుడు మానడం లేదని భార్య ఆత్మహత్య

జీడిమెట్ల: ఎంత చెప్పినా భర్త మద్యం తాగడం మానివేయడం లేదని ఓ గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ వివరాల ప్రకారం.. చింతల్ శ్రీనివావస్‌నగర్‌కు చెందిన నరేష్, లక్ష్మి(35) భార్యభర్తలు వీరికి ఐశ్వర్య(17), కార్తిక్(14) ఉన్నారు. నరేష్ కూరగాయల వ్యాపారం చేస్తూ వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ ఉండేవాడు. దీంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో పెద్దల మధ్య పంచాయితీ పెట్టిన ప్రతిసారి నరేష్ మద్యం తాగనని చెప్పి యథావిధిగా మద్యం సేవించేవాడు. మంగళవారం రాత్రి సైతం నరేష్ మద్యం సేవించి ఇంటికి రావడంతో వారు గొడవపడ్డారు. దీంతో విసుగు చెందిన లక్ష్మి మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి సోదరుడు హరీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.